క్లుప్తంగా

రైతు వేదికకు డోర్ బహూకరణ



దోర్ ఏర్పాటు చేయించిన అధికారులు, దాతలు

కేశంపేట: మండల పరిధిలోని అల్వాలలో ఉన్న రైతువేదిక మెయిన్‌డోర్ ఇటీవల కురిసిన ఈదురుగాలులకు విరిగిపోయింది. తాత్కాలికంగా మరమ్మతులు చేసిన ఉపయోగం లేకుండా పోయింది. గమనించిన గ్రామానికి చెందిన మస్తఫా పటేల్, అశ్వక్ పటేల్ రూ.25 వేల విలుగ గల ఐరన్ డోర్‌ను బహూకరించారు. దానిని వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ మంగళవారం ఏర్పాటు చేయించారు. దాతలు ముందుకురావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ఎలికట్టలో గ్రామ పంచాయతీ కార్మికులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుద్ధ నర్సింహ ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులకు రెండు జతల దుస్తులతో పాటు ఒక్కొక్కరికి 1000 రూపాయల చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ శుభ్రతలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్వినీ, నాయకులు బుద్దుల మల్లయ్య, చాకలి చంద్రయ్య, మల్లయ్య, నారం శ్రీపాద్‌రెడ్డి, ఆర్ల యాదయ్య, రాంరెడ్డి, పుల్లారెడ్డి, నర్సింహారెడ్డి, రాములు, యాదయ్య, ఆంజనేయులు, శివ, శ్రీను, నరేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుమార్‌యాదవ్

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీలో కొన్ని సంవత్సరాల నుంచి కష్టపడి పని చేసిన వారికే మండల, మున్సిపల్ అధ్యక్షుల పదవులను ఇవ్వాలని సీనియర్ నాయకుడు బైకని కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల, మున్సిపల్ అధ్యక్ష, పదవుల కోసం కొత్తగా పార్టీలో చేరిన వారు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేస్తూ జెండా మోసిన సీనియర్ నాయకులను కాంగ్రెస్ పార్టీ పెద్దలు గుర్తించి వారికి పదవులు అప్పజెప్పాలని కోరారు. కొత్తగా వచ్చిన వారికి పార్టీలో పదవులను ఇస్తే ఈ విషయాన్ని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసేందుకు నిర్ణయించుకున్నామన్నారు. అధిష్ఠానం పిలుపు మేరకు జిల్లా నాయకులు మండల, మున్సిపల్ అధ్యక్ష పదవులను సీనియర్‌లకు ఇచ్చి పార్టీ అభివృద్ధికి కృషి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారికి సన్మానం



జిల్లా అధికారి మధుసూదన్‌ను సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

కేశంపేట: జిల్లాలో నాన్ గెజిటెడ్ వెటర్నరీ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌ఫైలెట్ కోరారు. మంగళవారం ఇటీవల ఎన్నికైన నాన్ గెజిటెడ్ వెటర్నరీ అధికారులు హైదరాబాద్‌లోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జిల్లా అధికారి మధుసూదన్‌ను కలిసి సన్మానించారు. ఉద్యోగులు తమ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూచించారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని వారు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భరత్‌చారి, మల్లేశ్, అనంద్‌కుమార్, శివ, సులేమాన్, రాజరాం, వెంకటయ్య, శ్వేత, మురళీకృష్ణ, మధు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేత

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాయకులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు తమవంతు సహకారం అందించాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ కోరారు. మున్సిపాలిటీ పరిధి స్టేషన్‌తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల కోసం పార్టీ సీనియర్ నేత పాశం కృష్ణ సొంత ఖర్చులతో సమకూర్చిన నోట్‌బుక్స్, స్టేషనరీని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జీపీ భవనం పూర్తయ్యేదెన్నడో?



ఎత్‌మార్‌పల్లిలో అసంపూర్తిగా గ్రామ పంచాయతీ భవనం

నిధుల లేమితో నిలిచిన పనులు

- స్లాబ్, గోడలకే పరిమితం
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్‌రూరల్: గత ప్రభుత్వ హయాంలో తండాలు, పల్లెలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించారు. ఇందులో భాగంగా కొత్తగా ఏర్పడిన జీపీల్లో పాలన భవనాల నిర్మాణాలకు ఈజీఎస్ నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరు చేసింది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఏళ్లుగా భవన నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రెండేళ్లుగా నిలిచిన పనులు

మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లిని గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. అప్పట్లో నక్కలపల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉండేది. ఎత్‌మార్‌పల్లిలో పంచాయతీ పాలన ద్వారా భవనంలో ఏడు సంవత్సరాల పాటు కొనసాగింది. నూతన జీపీ భవన నిర్మాణానికి ఎస్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో అప్పటి పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి పాలన కొనసాగుతున్న భవనాన్ని కూల్చివేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. దాదాపు రెండు సంవత్సరాల నుంచి భవన నిర్మాణ పనులు స్లాబ్ గోడల వరకే పరిమితయ్యాయి. నిధులు మంజూరైనా బిల్లులు రాక స్లాబ్ గోడల దశలో పనులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి నిధులు మంజూరు చేసి భవనాన్ని పూర్తిచేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్‌ఏఈ ఆశాజ్యోతిని వివరణ కోరగా.. మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లిలో నూతనంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టి రెండు సంవత్సరాలు అయింది. ఆ పనులు స్లాబ్ గోడల వరకు పూర్తయ్యాయి. పూర్తయిన వరకు బిల్లులు పంపించాం. బిల్లులు రాగానే పనులు చేపడతామని వెల్లడించారు.

మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి

రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ మొయినాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్



విద్యార్థులతో రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ మొయినాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ×హ్యాపీ స్కూల్₹ ప్రాజెక్టులో భాగంగా పాల్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో పాఠశాలలో రూ.7లక్షలతో తరగతి గదుల పునఃరుద్ధరణ, 150 మంది విద్యార్థులకు బ్యాగులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు తమ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో పాఠశాలలో డిజిటల్ పరికరాలు, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రోటరీ క్లబ్ సెక్రటరీ శివానీ, సభ్యులు, పాఠశాల బృందం జయప్రకాశ్, మిరియాల శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పారదర్శకత తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు అధికారులు, బీఎల్ఓలు సమర్థవంతంగా పనిచేయాలని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని 64 బూత్‌ల బీఎల్‌ఓలతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు బీఎల్‌ఓలకు ఓటరు జాబితా తయారుపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో 64 బూత్‌లు ఉన్నాయని, బూత్‌ల వారీగా ఓటరు జాబితాను కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, చనిపోయిన ఓటర్ల తొలగింపు తదితర వాటిని ఒక్కటికి రెండుసార్లు పరిశీలించి పక్కాగా చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాల్లో బీఎల్‌ఓలకు ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. మండలంలోని సమర్థవంతంగా పని చేసి పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎన్నికల అధికారులు కృష్ణయ్య, పాండు, శిక్షణ అధికారులు ఆశీర్వాదం, అక్బర్, రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ




మాట్లాడుతున్న రవికుమార్

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు రవికుమార్

షాద్‌నగర్: ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటనోళ్ల రవికుమార్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యమాన్ని ప్రజల హృదయాల్లో ఎమ్మార్పీఎస్ సజీవంగా నిలిపి రాజీలేని పోరాటాన్ని నిర్వహించిందన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి వర్గీకరణ సాధనలో మందకృష్ణ మాదిగ కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన చేసిన పోరాటం మరువలేనిదని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర రాంచంద్రయ్య, ఇస్నాతి గంగాధర్, జోగు మల్లేశ్, అనంతయ్య, జగన్, సింగారం సుదర్శన్, ఇప్పలపల్లి దర్శన్, అశోక్, అంజయ్య, శివకుమార్, రాజు, కుమార్, నవీన్, రామయ్య, శంకరయ్య, భీమయ్య, శివకుమార్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ



ఇన్‌చార్జి ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, లబ్ధిదారులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకార్ శివాజీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నూతన పింఛన్లు రాని మహిళలతో కలిసి ఆయన ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.4వేలకు పెంచడంతో పాటుగా అర్హులందరికీ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిసరన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివగౌడ్, మణికంఠ, ఈశ్వరిబాయి, మణెమ్మ, లక్ష్మమ్మ, పరీదబేగం, పద్మ, మమత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత రంగాల్లో స్థిరపడాలని సీఐ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా, పీస్ ఫోరం ట్రస్టు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్‌ల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. సెల్‌ఫోన్‌లు వాడుతుండటంతో సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్ చేయడం, ఓటీపీలను, పిన్ నంబర్లు చెప్పడం వంటివి చేయొద్దని సూచించారు. అలా చేస్తే బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్లు ఖాళీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఫీస్ ట్రస్టు సీఈఓ బండారు అశోక్, ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్, ట్రస్టు మేనేజర్ షాకిరా పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారించి, నిర్మాణాలకు సంబంధించిన విషయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా నిత్యం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ గిరిరాజు, పంచాయతీ రాజ్ ఏఈ నందకిశోర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



తొట్టెలు ఊరేగిస్తున్న నాయకులు, గ్రామస్తులు

షాబాద్: మండల పరిధిలోని చందనవెళ్లిలో మంగళవారం బోనాలు ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారు తొట్టెలు ఊరేగించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి, వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మహిళల భద్రతే షీటీం లక్ష్యం

చేవెళ్ల డివిజన్ షీటీం ఎస్ఐ శ్యాంసుందర్

షాబాద్: మహిళల భద్రతకు షీటీం ఎప్పుడు రక్షణగా ఉంటుందని చేవెళ్ల డివిజన్ షీటీం ఎస్ఐ శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలకు షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల పట్ల వేధింపులు, దాడులను అరికట్టేందుకు పనిచేస్తున్నట్లు తెలిపారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్యవివాహాలు, మహిళల భద్రత, చట్టాలపై వ్యవసాయ కూలీలకు క్లుప్తంగా వివరించారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



షాద్‌నగర్: ధర్నాకు తరలిన నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాకు మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ పేరుతో బీసీలను మోసం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. గతంలో చాలా బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పటికీ అవి అమలు కాలేదని ఆరోపించారు. ఏ బిల్లుకైనా రాజ్యాంగపరమైన ఆమోదం లభించినప్పుడే అది అమల్లోకి వస్తుందన్నారు. ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు అర్థంలేని ప్రకటనలు చేస్తూ ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారన్నారు. రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈట గణేష్, ఎమ్మె శ్రీలత, సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఇందిరాపార్కుకు తరలిన నాయకులు

కేశంపేట: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బీసీ మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు, నేతలు భారీగా తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, నవీన్‌కుమార్, కానం ప్రేమ్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, శ్రీను, గణేష్, నరేష్, దశరథ్, శ్రీశైలం తదితరులు తరలివెళ్లారు.

పండ్ల తోటలతో అధిక లాభాలు

ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్

కొందుర్గు: పండ్ల తోటల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం మండలంలోని ఎదిర గ్రామంలో పర్యటించి మామిడి, జామ, డ్రాగన్‌పండ్ల తోటల సాగుతో పాటు ఈత సాగు, పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలను వివరించారు. రైతులకు రాయితీపై డ్రిప్ ఇవ్వడంతో పాటు మూడేళ్ల పాటు సంరక్షణ ఖర్చులు ఇస్తుందన్నారు. అదేవిధంగా రైతులు మూడేళ్ల వరకు అంతర పంటలు సాగుచేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో టీఏ వినోద్‌కుమార్, కార్యదర్శి పాండురంగం, ఈసీ లక్ష్మారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీ అధికారులు, స్థానిక నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో నెలకొన్న సమస్యలను, వాటిని పరిష్కరించే మార్గాలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణాల్లో వ్యర్థాల సేకరణ, నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్యలు లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కూడళ్లను సుందరీకరించాలన్నారు. ఇందుకు గాను ప్రధాన రహదారులను విస్తరించాలన్నారు. డ్రైనేజీలు, నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి వంటి పనులతో మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా గత పదేళ్లలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

రోబోస్ప్రేర్‌తో మందుల పిచికారీ



మరియాపురంలో రోబోస్ప్రేర్‌తో మందు పిచికారీ

షాబాద్: మండలంలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేయడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో మరియాపురం గ్రామానికి చెందిన రైతు విజయ్‌భాస్కర్‌రెడ్డి మొక్కజొన్న, పత్తి పంటకు రోబోస్ప్రేర్‌తో మందులు పిచికారీ చేస్తున్నాడు. ఈ యంత్రం ద్వారా 40 నిమిషాలలో 4 ఎకరాలకు మందు పిచికారీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రోజుకు 30 నుంచి 40 ఎకరాల్లో పత్తి పంటకు మందు పిచికారీ చేస్తున్నామన్నారు. రోబోస్ప్రేర్ ట్యాంక్‌లో 600 వందల లీటర్ల నీటితో పాటు పురుగు మందులు కలిపి పంటకు కొడుతున్నట్లు వివరించాడు.

డబుల్ ఇళ్లను త్వరగా అందించాలి

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను తమకు వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు రెవెన్యూ అధికారికి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అజీజ్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి మూడేళ్లు దాటిపోయినా ఇప్పటికీ తమకు అప్పగించడం లేదన్నారు. ఈ విషయమై అనేక సార్లు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు విన్నవించామన్నారు. కరెంటు కనెక్షన్, నీటి సదుపాయాలు సమకూర్చి తమకు త్వరగా ఇళ్లను అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు సీహెచ్.ప్రవీణ్‌కుమార్, దప్పు ప్రవీణ్‌కుమార్, రజినీకాంత్, ఏసు, విజయేందర్, అరుణ్, కమలమ్మ, సతీష్, పుష్పలత తదితరులు ఉన్నారు.

17, 18న కొత్తూరులో బోనాల ఉత్సవాలు

కొత్తూరు: ఈ నెల 17న పోచమ్మ, 18వ తేదీన మైసమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలు, యువకులు బోనాల జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు.